సన్మానం


ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న డీఐ శ్రీను తదితరులు

గౌలిపురా: బదిలీపై వెళుతున్న మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగ దుర్గా ప్రసాద్‌ను స్టేషన్ సిబ్బంది బుధవారం సన్మానించారు. ఇన్నాళ్ల పాటు పోలీస్‌స్టేషన్‌తో ఆయన ఉన్న అనుబంధాన్ని తోటి సిబ్బందితో పంచుకున్నారు. అనంతరం డీఐ శ్రీను, ఎస్సై కృష్ణకాంత్, ఇతర సిబ్బంది ఆయనకు శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి వీడ్కోలు పలికారు.

సేవాలాల్ జయంతి రోజును సెలవు దినంగా ప్రకటించాలి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ రాజేష్ కుమార్ జాదవ్

నాంపల్లి: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి రోజున రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సెలవు దినంగా ప్రకటించాలని లంబాడీల (బంజారా) ఐక్యవేదిక (లైవ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన మంత్రి సీతక్క ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యోగ సంఘాల నాయకులు బోడ భద్రు నాయక్, లైవ్ ముఖ్య సమన్వయకర్త గుగులోత్ రమేష్ జాదవ్, ఉద్యోగ విభాగం రాష్ట్ర కన్వీనర్ రాందాస్ నాయక్, రాష్ట్ర కన్వీనర్ గుగులోత్ ప్రవీణ్ నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించడం హర్షణీయం


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మహేష్ బాబు

జియాగూడ: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశం చరిత్రలోనే మొదటిసారి ఎస్సీ కుల వర్గీకరణతో పాటు అన్ని కులాల వారికీ సామాజిక న్యాయం చేశారని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ఆర్ రాజ్ ఠాకూర్ అన్న సైన్యం గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ, జియాగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి మహేశ్‌బాబు అన్నారు. ఈ మేరకు బుధవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నేతృత్వంలో సీఎంను కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మహేశ్ బాబు మాట్లాడుతూ..40 ఏళ్ల సుదీర్ఘ కళను సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించడం హర్షణీయమన్నారు.

కారులో గుర్తు తెలియని వ్యక్తి మృతి

దూద్‌బౌలి: అనారోగ్యంతో ఓ గుర్తు తెలియని వ్యక్తి కారులో కూర్చొని మృతి చెందిన ఘటన హుస్సేనీ ఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బుధవారం హుస్సేనీ ఆలం ఎస్సై ప్రియాంక తెలిపిన వివరాల ప్రకారం.. శాలిబండ రాజేష్ మెడికల్ ప్రాంతంలో ఐదు రోజుల నుంచి మరమ్మతుల కోసం అక్కడ పార్క్ చేసిన కారులో ఆ ప్రాంతంలోనే భిక్షాటన చేసే వ్యక్తి కూర్చొని చనిపోయాడు. గమనించిన స్థానికులు హుస్సేనీ ఆలం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు


బంజారాహిల్స్: ఓ యువతి వెంట పడి వేధిస్తున్న ఆమె సహచర ఉద్యోగిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..ఎస్సార్ నగర్‌లోని హాస్టల్‌లో ఉండే యువతి బంజారాహిల్స్ పార్కువ్యూ ఎన్‌క్లేవ్‌లోని ఓ ప్రైవేటు కార్యాలయంలో పనిచేస్తుంది. అక్కడే పనిచేసే మెట్టు విల్సన్ అనే వ్యక్తి తరచూ ఆమె వెంట పడి వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని బాధితురాలు తమ మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లగా అతను మందలించాడు. అయినా తన వైఖరి మార్చుకోని విల్సన్ ఆమెను వేధిస్తూనే ఉన్నాడు. ఈ విషయాన్ని బాధితురాలు మేనేజర్ దృష్టికి తీసుకెళ్లగా అతను విల్సన్‌ను నిలదీశాడు. దీంతో ఆగ్రహానికి లోనైన విల్సన్ అతడిపై చేయి చేసుకున్నాడు. దీంతో భయాందోళనకు గురైన బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కింద కార్ఖానా.. పైన పాఠశాల!

- పుట్టగొడుగుల్లా కార్ఖానాలు
- ప్రమాదాలు జరిగితే ఆస్తి, ప్రాణనష్టాలే..
- దృష్టి సారించాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు


కార్ఖానాలో బ్యాగుల తయారీ కేంద్రం


కార్ఖానాలో నిల్వ చేసిన ఉత్పత్తులు


పైన పాఠశాల, కింద కార్ఖానా నడుస్తున్న భవనం

నాంపల్లి: అదో బహుళ అంతస్తుల భవనం.. పైఅంతస్తులో ప్రైవేట్ పాఠశాల, సెల్లార్‌లో కార్ఖానా కొనసాగుతోంది. ఈ రెండింటికీ ఎలాంటి అనుమతులు లేవు. ఓల్డ్ మల్లేపల్లి బైబిల్ సమీపంలోని ఆసిఫ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్న ఈ ఈ భవనాన్ని అద్దెలకు ఇచ్చారు. అయితే అసలే ఎండలు మండుతున్నాయి. చిన్నపాటి షార్ట్ సర్క్యూట్ జరిగితే భవనాలన్నీ మంటల్లో కాలిపోయే ప్రమాదం ఉంటుందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో కార్ఖానాలకు మంటలు అంటుకుని ఆస్తి, ప్రాణనష్టం జరిగిన దాఖలాలు కోకొల్లలు ఉన్నాయి. బజార్‌ఘాట్‌లో జరిగిన అగ్ని ప్రమాదం చూస్తే భారీ ప్రాణ నష్టం జరిగింది. అలాగే ఇటీవల చార్మినార్‌లో జరిగిన అగ్ని ప్రమాదం చూస్తే భారీ ఎత్తున ఆస్తినష్టం చోటు చేసుకుంది. కోట్లల్లో వ్యాపారులు నష్టపోయారు. అలాగే మూడేళ్ల కిందట సీతారామ్‌బాగ్‌లోని ఓ బహుళంతస్తుల భవనంలో ఫర్నిచర్ గోడౌన్‌కు మంటలు అంటుకున్నాయి. ఇదే భవనం పైఅంతస్తులో ఓ ప్రైవేట్ పాఠశాల ఉండేది. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో పాఠశాలలకు వేసవి సెలవులు ఉండటంతో ప్రాణనష్టం జరుగకుండా కేవలం ఆస్తినష్టమే జరిగింది.

అనధికారిక కార్ఖానాలే అధికం..

నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా అనధికారిక కార్ఖానాలు, దుకాణాలే దర్శనమిస్తుంటాయి. ఫర్నీచర్, చాక్లెట్, బ్యాగుల తయారీ, ప్లైవుడ్ గోడౌన్లు, కల్తీ అల్లం వెల్లుల్లి, కల్తీ నెయ్యి తయారీ, ప్రింటింగ్ ప్రెస్, ప్లాస్టిక్ గోడౌన్లు తదితర ఖార్ఖానాలు పుట్టుగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇవన్నీ బహుళ అంతస్తుల భవనాల సెల్లార్లలో కొనసాగుతున్నాయి. యజమానులు సైతం మాకు అద్దెలు వస్తే చాలంటూ కిరాయిలకు ఇచ్చేస్తున్నారు. అద్దెలకు తీసుకున్న వాళ్లు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఎక్కడపడితే అక్కడ కార్ఖానాలు కొనసాగిస్తున్నారు. జనవాసాల్లోనే అధికంగా కార్ఖానాలు వెలుస్తున్నాయి. ఇళ్ల మధ్యల్లో కార్ఖానాలు ఏర్పాటు కావడంతో జనాలు బెంబేలెత్తిపోతున్నారు. సీతారామ్‌భాగ్, మల్లేపల్లి, ఆసిఫ్‌నగర్ తదితర ప్రాంతాల్లో కొందరు తమ ఇళ్లను కార్ఖానాలుగా మార్చేశారు. మరికొందరు సెల్లార్లల్లో ఏర్పాటు చేశారు. ఇలా ఎక్కడ చూసినా కార్ఖానాలు దర్శనమిస్తున్నాయి. ఈ కార్ఖానాలన్నీ అనధికారికంగా వెలిసినవే ఉన్నాయి. కార్ఖానాలను నగరం శివార్లకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ కరువు..

ప్రైవేట్ పాఠశాలలపై సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ కరువైంది. ఏడాదికి ఒక రోజు కూడా ఏరియాలోని తమ పరిధిలోకి వచ్చే ప్రైవేట్ పాఠశాలలను సందర్శించడం లేదు. అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం అయ్యారు. ఫలితంగా ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లాగా వెలుస్తున్నాయి. అనుమతులు, నిబంధనలను తుంగలో తొక్కేస్తున్నారు. పరిమితులను అతిక్రమించి పాఠశాలలను నడుపుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడిచే ప్రైవేట్ పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కార్ఖానాలు, పాఠశాలలు ఒకే ప్రాంగణంలో ఉండటం చట్ట విరుద్ధమని సంబంధిత విద్యా శాఖ అధికారులకు తెలిసినా ఎందుకు మిన్నకుంటున్నారో అర్థం కావడం లేదు. ఉన్నతాధికారులైనా స్పందించి నిబంధనలకు విరుద్ధంగా కొనసాగే ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

విద్య, యువజన సంక్షేమానికి బడ్జెట్లో 20 శాతం కేటాయించాలి

దూద్‌బౌలి: విద్య, యువజన సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం బడ్జెట్ కేటాయించాలని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్ఐఓ) సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ఫరాజ్ అహ్మద్ కోరారు. బుధవారం చెత్తాబజార్ లోని ఎస్ఐఓ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 2025–2026 ఆర్థిక సంవత్సరానికి విద్యా యువజన సంక్షేమ బడ్జెట్ సిఫారసులపై ఎస్ఐఓ తెలంగాణ పుస్తకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా రంగానికి తగినన్ని నిధులు కేటాయించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేయరూ..

చాంద్రాయణగుట్ట: ఏడాది కాలంగా గోతులమయంగా మారిన ఉప్పుగూడ కృష్ణారెడ్డి నగర్‌లోని రహదారులకు వెంటనే మరమ్మతులు చేయాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జాలిగం చిరంజీవి కోరారు. ఈ మేరకు బీజేపీ నాయకుల బృందం జోనల్ కమిషనర్ వెంకన్నను బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. చిరంజీవి మాట్లాడుతూ..కృష్ణారెడ్డి నగర్‌లో ఏడాది క్రితం పైప్‌లైన్ పనుల కోసం రోడ్డును తవ్వి వదిలేయడంతో ప్రజలు నిత్య నరకం అనుభవిస్తున్నారన్నారు. ఏఈ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. దీనికి స్పందించిన జోనల్ కమిషనర్ త్వరలోనే నూతన రహదారులు వేస్తామని వారికి హామీ ఇచ్చారు. నాయకులు గంజి వేణు, అజయ్, జగదీష్, శివకాంత్, రాజు, వెంకటేష్,, రవి కిరణ్, రోహిత్ పాల్గొన్నారు.

మదీనాలో జానీమాజ్‌ల ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ముస్లిం మత పెద్దలు

చార్మినార్: రంజాన్ మాసంలో ముస్లింలు నమాజ్‌ల కోసం వినియోగించే జానీమాజ్‌ల ఎగ్జిబిషన్‌లో పాతబస్తీలోని మదీనాలో ఏర్పాటు చేశారు. మహమ్మద్ క్యాప్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ ఇలియాజ్ బుకారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ స్థాయి జానీమాజ్‌ల ఎగ్జిబిషన్‌ను బుధవారం జామే నిజామియా అల్యుమ్నీ అసోసియేషన్ కార్యదర్శి సుల్తాన్ మోహీద్దీన్ నక్షాబందీ, ఖ్వారీ నజీర్ మున్షాభి తదితరులు ప్రారంభించి తిలకించారు. ఈ సందర్భంగా మహమ్మద్ ఇలియాస్ బుకారి మాట్లాడుతూ.. దేశంలోని ప్రముఖ మసీదులకు జానీమాజ్‌లను సరఫరా చేసే గౌరవం ముహమ్మద్ క్యాప్ మార్ట్‌కు దక్కిందన్నారు. ప్రతి ఏడాదిలాగే ఈ రంజాన్ మాసంలో కూడా అన్ని రకాల స్వదేశీ, ఇంపోర్టెడ్ జానిమాజ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. సౌదీ అరేబియా, టర్కీ, బెల్జియం దేశాలకు చెందిన కార్పెట్ జానిమాజ్‌లకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ ఎగ్జిబిషన్ నెలరోజులు కొనసాగుతుందని చెప్పారు.

ఈ-పెట్టీ కేసులో యువకుడికి జైలు శిక్ష


చింటూ

గౌలిపురా: భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ఈ-పెట్టీ కేసులో యువకుడికి న్యాయస్థానం ఐదు రోజుల జైలు శిక్షను విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తాన్‌షాహి ప్రాంతానికి చెందిన రత్లావత్ చింటూ (20)పై పెట్టీ కేసు నమోదయ్యింది. కేసును విచారించిన నాంపల్లి కోర్టు న్యాయమూర్తి సత్యనారాయణ ఐదు రోజుల శిక్షను విధిస్తూ తీర్పును వెలువరిచారు.

బాలుడి అదృశ్యం


రిజ్వాన్ ఆలం

గౌలిపురా: మానసిక వ్యాధితో బాధపడుతున్న బాలుడు అదృశ్యమైన సంఘటన భవానీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..తలాబ్ కట్టా ప్రాంతానికి చెందిన సోని ఖాతూన్, సద్దాం ఆలంల కుమారుడు రిజ్వాన్ ఆలం (7) మానసిక వారితో బాధపడుతున్నాడు. కాగా బుధవారం ఉదయం 8:30 గంటలకు కుటుంబ సభ్యులు లేచి చూడగా రిజ్వాన్ ఆలం కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

19 నుంచి లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు


బ్రోచర్ విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలోని స్వయం భూ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను ఈనెల 19వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మహేష్ గౌడ్ తెలిపారు. ఉత్సవాలు సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం కమిటీ సభ్యులు ఆవిష్కరించి, ఉత్సవాల వివరాలు వెల్లడించారు. 19న పంచామృత స్నపన తిరుమంజనం, దివ్య ప్రబంధ పారాయణం, 20న ధ్వజారోహణం, రాత్రి పల్లకీ ఊరేగింపు, స్వామి, అమ్మవార్ల ఎదుర్కోళ్ల కార్యక్రమం ఉంటుందన్నారు. 21న మధ్యాహ్నం స్వామి వారి తిరు కల్యాణోత్సవం కనుల పండువగా జరుగనుందన్నారు. ఈ ఉత్సవానికి రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ ప్రభాకర్ హాజరవుతారని తెలిపారు. 22న నృసింహ హవనము, 23న నిర్వహించే ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి బి.వెంకటేష్ ముదిరాజ్, ఆలయ కమిటీ సభ్యులు బి.వందన, విజయలక్ష్మీ, శ్రీధర్, అర్చకులు కంజర్ల ప్రతాపాచార్యులు, స్థానిక నాయకులు రాజు ముదిరాజ్, జంగరాజు, అశోక్ ముదిరాజ్ పాల్గొన్నారు.

గోల్కొండ ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి కృషి


ఎమ్మెల్యే కౌసర్‌ను సన్మానిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రికి సుమారు ఆరున్నర కోట్ల రూపాయలు మంజూరైన సందర్భంగా బుధవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్నారని, ఆయన ప్రయత్నాల ఫలితంగానే గోల్కొండ ఆసుపత్రికి నూతన ఓపీ బ్లాక్ నిర్మాణానికి నాలుగున్నర కోట్ల రూపాయలు మంజూరయ్యాయని అంతేకాకుండా వైద్య పరికరాల కొనుగోలుకు రూ.1.80 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఆయనను కలిసిన వారిలో ఆర్ఎంఓ డాక్టర్ రాకేష్‌కుమార్, ఏఏవో డాక్టర్ కె.సంపత్‌కుమార్ తదితరులున్నారు.

మాదిగ కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న బోయిని ఎల్లేష్ మాదిగ

సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో దళితుల హత్యలు జరిగినప్పుడు స్పందించని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓ బ్రాహ్మణుడిపై జరిగిన దాడిపై స్పందించి దళితులపై వివక్షత ప్రదర్శించారని మాదిగ రిజర్వేషన్ సమితి పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని ఎల్లేష్ మాదిగ మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..సూర్యాపేట జిల్లాలో వండ్లకొండ కృష్ణ అనే దళిత యువకుడిని పరువు హత్య జరిగినా ప్రభుత్వం స్పందించలేదు కానీ చిలుకూరి బాలాజీ పూజారిపై జరిగిన దాడిని ముఖ్యమంత్రి ఖండించడం శోచనీయమన్నారు. 1995 చట్టం ప్రకారం.. సంవత్సరానికి మూడు సార్లు ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి అట్రాసిటీ చట్టంపై సమీక్షా సమావేశం నిర్వహించాల్సి ఉండగా అది జరగడం లేదన్నారు. అలాగే మాదిగలు ఆర్థికాభివృద్ధి చెందడానికి మాదిగ జీఓ విడుదలైనా నేటి వరకు మాదిగ కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా మాదిగ మంత్రులు, ఎమ్మెల్యేలు మాదిగ కార్పొరేషన్ ఏర్పాటుకు పోరాటం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అమరేందర్ మాదిగ, దర్శనం రామస్వామి, జై భీమ్ ప్రజా సమితి చైర్మన్ లంకా దాసరి శ్రీనాథ్, శేఖర్, సూరి, అనిల్‌కుమార్, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థుల్లో పరీక్షల ఒత్తిడిని పోగొట్టాలి


జయప్రదకు వినతిపత్రాన్ని అందజేస్తున్న జాజుల లింగం గౌడ్

నాంపల్లి: ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయ్యే వరకు మానసిక నిపుణులచే విద్యార్థులకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇప్పించాలని ఇంటర్మీడియట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జయప్రదకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయానికి చేరుకుని జాజుల లింగం గౌడ్ నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం హాజరై ఆమెకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..పరీక్షలు దగ్గర పడుతున్నకొద్దీ ఇంటర్ విద్యార్థుల్లో ఒత్తిడి పెరిగి భయంతో మానసికంగా కృంగిపోయే అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు యోగా, మెడిటేషన్ తరగతులు కూడా నిర్వహించాలని పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బూర శ్రీనివాస్, ఓయూ జేఏసీ ప్రెసిడెంట్ బండి నరేష్, మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రమోహన్ రాయ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు గోదా రవీంద్ర పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో అలరించిన సింగర్ సునీత



అబిడ్స్: 84వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనశాల (నుమాయిష్)లో ప్రముఖ గాయకురాలు సునీత బుధవారం తన గీతాలతో అందరిని అలరించింది. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ముఖైర్ అహ్మద్, అడ్వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'రంగరాజన్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నాం'


మాట్లాడుతున్న కందూరి కృష్ణమాచారి

సుల్తాన్‌బజార్: చిలుకూరు అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడిని తీవ్రస్థాయిలో ఖండిస్తున్నట్లు తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జేఏసీ అధ్యక్షుడు కందూరి కృష్ణమాచారి అన్నారు. బుధవారం దేవాదాయ, ధర్మాదాయ కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించిన అర్చక ఉద్యోగ జేఏసీ సమావేశంలో రంగరాజన్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దశాబ్దాలుగా ఆలయాల్లో హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేసిన అర్చకుడి ఇంటికి వెళ్లి దాడి చేయడం అమానుషం అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జేఏసీ కన్వీనర్ పరశురామ్ రవీందర్ చార్యులు, హైదరాబాద్ గ్రేటర్ ఉద్యోగ శాఖ అధ్యక్షులు బండారి జగపతి, జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, చింతపట్ల బద్రినాథ్ ఆచార్యులు, అగ్నిహోత్రం చంద్రశేఖర శర్మ, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

షబ్-ఎ-బారాత్‌కు సర్వం సిద్ధం


జమాలికుంట శ్మశాన వాటికకు రంగులు వేస్తున్న దృశ్యం


విద్యుత్ కాంతులతో మెహిదీపట్నం ఏక్‌మినార్ మసీదు

గోల్కొండ: నేడు జరిగే షబ్-ఎ-బారాత్ ప్రత్యేక ప్రార్థనలకు మసీదులు ముస్తాబయ్యాయి. కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల్లోని జామా మసీదులు కొత్త రూపును సంతరించుకున్నాయి. అహ్మద్‌నగర్, మెహిదీపట్నం, గుడిమల్కాపూర్, గోల్కొండ, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లోని మసీదులను షబ్-ఎ-బారాత్ ప్రార్థనల కోసం మసీదు కమిటీల వారు విద్యుత్ దీపాలతో అలంకరించారు. మెహిదీపట్నంలోని ఏక్‌మినార్ మసీదు, టోలిచౌకీ చౌరస్తాలోని బిలాల్ జామా మసీదు, మురాద్‌నగర్‌లోని చోటీ మసీదులు విద్యుత్ కాంతులతో సరికొత్త శోభను సంతరించుకున్నాయి.

ముస్లిం శ్మశాన వాటికల్లో అభివృద్ధి పనులు..

షబ్-ఎ-బారాత్‌ను పురస్కరించుకొని కార్వాన్, హకీంపేట్, గోల్కొండ, అహ్మద్‌నగర్, లంగర్‌హౌస్ తదితర ప్రాంతాల్లోని ముస్లిం శ్మశానవాటికల్లో పనులు జోరుగా సాగుతున్నాయి. గురువారం రాత్రి జరిగే షబ్-ఎ-బారాత్ ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలు శ్మశానవాటికలను సందర్శిస్తారు. మృతి చెందిన తమ కుటుంబ సభ్యుల సమాధులపై పూలచదర్ సమర్పించి ప్రార్థనలు చేస్తారు. ఇందులో భాగంగా జమాలికుంట శ్మశాన వాటిక, ఫస్ట్ లాన్సర్ శ్మశానవాటికతో పాటు కార్వాన్ ముస్లిం శ్మశానవాటికల ప్రహరీలకు రంగులు వేస్తున్నారు.

ఘనంగా సంత్ రవిదాస్ జయంతి

జియాగూడ: సంత్ రవిదాస్ మహరాజ్ కులవృత్తి చెప్పుల తయారీ చేస్తూ ఆధ్యాత్మిక బోధనలు చేయగా నేటికీ మార్గదర్శకంగా నిలిచారని బీజేపీ జియాగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేష్ యాదవ్ అన్నారు. బుధవారం జియాగూడ సంజయ్ నగర్ నల్లపోచమ్మ ఆలయం వద్ద సంత్ రవిదాస్ జయంతి వేడుకలు సూర్యవంశీ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు కాగా ఆయన హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అర్జున్ ఠాక్రే, లడ్డూ సింగ్, ప్రవీణ్ కుమార్, అనిల్, బిర్జు, ఆర్.హేమంత్, డి.ప్రమోద్, ఆర్.శారద్, ఆర్.ముఖేష్, జె.నర్సింగ్, కె.ముఖేష్, దేవాన్ష్, వినాయక, సాగర్, విరాజ్, అషు తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో వెంకటేష్ యాదవ్ తదితరులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9989616273